

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ దాదాపు ఏడాదిన్నర తర్వాత మళ్లీ బరిలోకి దిగింది. జాతీయ సీనియర్ రెజ్లింగ్ టోర్నీలో పోటీకి దిగిన వినేశ్ విజేతగా నిలిచి ఆకట్టుకుంది.



## ప్రిక్వార్టర్స్‌లో సహజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ముంబై ఓపెన్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ ప్లేయర్ యామలపల్లి సహజ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. డబ్ల్యూటీఏ 125కే టోర్నీ తొలి రౌండ్‌లో సహజ 6-4, 1-6, 6-4తో ప్రపంచ 92వ ర్యాంకర్ కాయ్‌లా డాయ్ (అమెరికా)పై విజయం సాధించింది. తన కంటే మెరుగైన ప్రత్యర్థిపై తొలి సెట్ సులువుగా గెలిచిన సహజ.. రెండో సెట్‌లో పరాజయం పాలైనా.. నిర్ణయాత్మక సెట్‌లో విజృంభించింది.

## శ్రీలంక ఘన విజయం

కొలంబో: సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కిన శ్రీలంక.. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో విజయం సాధించింది. నాలుగు రోజుల్లో ముగిసిన పోరులో లంక 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. అఫ్గాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేయగా.. లంక 439 రన్స్ కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో 296 పరుగులు చేసిన అఫ్గాన్.. ప్రత్యర్థి ముందు 56 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. లంక వికెట్ కోల్పోకుండా టార్గెట్ చేజ్ చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు పడగొట్టిన ప్రభాత్ జయసూర్యకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

# లెక్క సరి!

**సంచలనాలకు తావివ్వకుండా.. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటిన టీమ్ఇండియా.. సిరీస్ సమం చేసింది. ఉప్పల్ టెస్టులో బజ్‌బాల్ ఆటతీరుతో అనూహ్య విజయం అందుకున్న ఇంగ్లండ్.. వైజాగ్‌లో సేమ్ సీన్ రిపీట్ చేయలేకపోయింది!**

**399 పరుగుల లక్ష్యఛేదనలో 67/1తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్‌ను మన బౌలర్లు నిలువరించారు. బుమ్రా, అశ్విన్ చెరో మూడు వికెట్లతో విజృంభించగా.. బ్యాటింగ్‌లో రాణించలేకపోయిన అయ్యర్ చక్కటి త్రోతో స్టోక్స్‌ను రనౌట్ చేయడంతో మ్యాచ్ మన వశమైంది!!**

**'60 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదిస్తాం' అని బీరాలు పలికిన ఇంగ్లండ్ ఆటగాళ్ల మెడలు వంచిన రోహిత్ సేన.. 1-1తో సిరీస్ సమం చేసింది. కాస్త విరామం అనంతరం ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో ఇరు జట్ల మధ్య మూడో టెస్టు ప్రారంభం కానుంది.**

**రెండో టెస్టులో భారత్ ఘన విజయం • ఇంగ్లండ్ 292 ఆలౌట్ • బుమ్రాకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'**



విశాఖపట్నం: దూకుడుగా ఆడి భారీ లక్ష్యాన్ని ఛేదించాలనే సంకల్పంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టుకు పరాభవం తప్పలేదు. భారత గడ్డపై ఇదివరకెన్నడూ సాధ్యం కానంత పెద్ద లక్ష్యఛేదనలో ఇంగ్లిష్ జట్టు తడబడింది. 399 పరుగుల చేజింగ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 67/1తో సోమవారం నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ చివరకు 292 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా 106 పరుగుల తేడాతో జయకేతనం ఎగరవేసిన టీమ్ఇండియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది. రికార్డు ఛేదనలో ఇంగ్లండ్ బ్యాటర్లు నిలకడ చూపలేకపోయారు. దూకుడుగా ఆడాలనే ప్రయత్నంలో ఒకరి వెంట ఒకరు పెవిలియన్ బాట పట్టారు. జాక్ క్రాలీ (73; 8 ఫోర్లు, ఒక సిక్సర్) ఒక్కడే అర్ధశతకంతో రాణించగా.. బెన్ డకెట్ (28), రెహాన్ అహ్మద్ (23), ఓలీ పోప్ (23), రూట్ (16), బెయిర్‌స్టో (26), కెప్టెన్ స్టోక్స్ (11), బెన్ ఫోక్స్ (36), టామ్ హార్ట్‌లీ (36) ఓ మాదిరిగా ఆడారు. ఇన్నింగ్స్‌ను నడిపించే సత్తా ఉన్న సీనియర్ బ్యాటర్ జో రూట్ వైఫల్యం ఆ జట్టును దెబ్బతీసింది. భారత బౌలర్లలో బుమ్రా, అశ్విన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**డబ్ల్యూటీసీలో రెండో ర్యాంక్‌కు**

ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో ఘనవిజయం సాధించిన భారత్.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకొచ్చింది. ఈ మ్యాచ్‌కు ముందు ఆరో ప్లేస్‌లో ఉన్న రోహిత్ సేన నాలుగు స్థానాలు ఎగబాకి 52.77 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది.

**1** ఇంగ్లండ్‌పై అత్యధిక (97) వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అశ్విన్ చరిత్రకెక్కాడు. బీఎస్ చంద్రశేఖర్ (95) రెండో స్థానంలో ఉన్నాడు.

**2** టెస్టు క్రికెట్‌లో బుమ్రాకు ఇది (9/91) రెండో అత్యుత్తమ ప్రదర్శన. 2018లో ఆస్ట్రేలియాపై మెల్‌బోర్న్‌లో బుమ్రా 86 పరుగులకే 9 వికెట్లు తీశాడు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253; భారత్ రెండో ఇన్నింగ్స్: 255; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 292 (క్రాలీ 73, హార్ట్‌లీ 36; బుమ్రా 3/46, అశ్విన్ 3/72).

## ఊరటనిచ్చే విజయం!

లక్ష్యం భారీగానే ఉన్నా.. ప్రత్యర్థి దూకుడు మీద ఉండటంతో కాస్త ఆందోళన చెందిన టీమ్ఇండియాకు.. ఊరటనిచ్చే విజయం దక్కింది. హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్టులో శాసించే స్థితి నుంచి మ్యాచ్‌ను చేజార్చుకున్న రోహిత్‌సేన.. వైజాగ్‌లో ఆ తప్పు చేయలేదు. 'బజ్‌బాల్'తో కౌంటర్ ఇద్దామనుకున్న ఇంగ్లిష్ బ్యాటర్లను.. మనవాళ్లు చక్కటి బౌలింగ్‌తో చుక్కలు చూపారు. సుదీర్ఘ కాలంగా ఇంగ్లండ్ టెస్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న జో రూట్ ఈ సిరీస్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం ఆ జట్టును దెబ్బకొట్టింది. భారీ లక్ష్యఛేదనలో మిగిలినవాళ్లంతా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా.. మరో ఎండ్‌లో రూట్ పాతుకుపోయి ఉంటే పరిస్థితి వేరేగా ఉండేది. ఏదేమైనా.. లక్ష్యాన్ని ఛేదించేందుకే ప్రయత్నిస్తామని బల్లగుద్ది చెప్పిన స్టోక్స్.. మ్యాచ్ అనంతరం తమ ప్రయత్నాన్ని సమర్థించుకున్నాడు. కాస్త దూరంలో నిలిచిపోయామని జట్టు సభ్యులను అభినందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ వెన్నులో వణుకు పుట్టించిన బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ మూడు కీలక వికెట్లు ఖాతాలో వేసుకోగా.. అశ్విన్ మిగిలిన పని కానిచ్చాడు. గాయం కారణంగా గిల్ నాలుగో రోజు ఫీల్డింగ్‌కు దూరం కాగా.. మనవాళ్లు ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఓలీ పోప్ స్లిప్‌లో ఇచ్చిన షార్ప్ క్యాచ్‌ను రోహిత్ ఒడిసిపట్టిన తీరును ఎంత మెచ్చుకున్నా తక్కువే. ఇక బ్యాటింగ్ ఆర్డర్‌లో దిగువన క్రీజులో అడుగుపెట్టి అసమాన పోరాటాలు చేసిన అనుభవం ఉన్న స్టోక్స్‌ను శ్రేయస్ చక్కటి త్రోతో డగౌట్ బాట పట్టించగా.. చివర్లో ఫోక్స్, హార్ట్‌లీ పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కావడంతో మూడో మ్యాచ్‌కు ముందు ఇరు జట్లకు సుదీర్ఘ విరామం లభించనుండగా.. గాయాల బారిన పడిన భారత ప్లేయర్లకు అప్పటి వరకు కోలుకుంటారా లేదో చూడాలి! ఇషాన్ కిషన్ తిరిగి దేశవాళీల్లో రాణిస్తేనే జాతీయ జట్టుకు ఎంపిక చేస్తామని హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రకటించగా.. గణాంకాలను పట్టించుకోనని బుమ్రా వెల్లడించాడు.

*-నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*

## భారత్ X దక్షిణాఫ్రికా

అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్

బెనోనీ: అండర్-19 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న యువ భారత జట్టు.. మంగళవారం ఆతిథ్య దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. లీగ్ దశలో పరాజయం ఎరగకుండా సూపర్ సిక్స్‌కు చేరిన యంగ్ ఇండియా.. అందులోనూ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ టోర్నీలో అడుగుపెట్టిన యువభారత్.. అందుకు తగ్గట్లే ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్నది. బ్యాటింగ్‌లో కెప్టెన్ ఉదయ్, అర్షిన్, ముషీర్, సచిన్ దాస్ ఫుల్ ఫామ్‌లో ఉండగా.. బౌలింగ్‌లో సామీ కుమార్, రాజ్ లింబానీ, నమన్ తివారీ, మురుగన్ అశ్విన్ సత్తాచాటుతున్నారు. మరో సెమీస్‌లో ఆస్ట్రేలియా, పాకిస్థాన్ తలపడనున్నాయి.



## రచిన్ డబుల్ సెంచరీ



రచిన్ (240)

మౌంట్ మాంగనీ: యువ బ్యాటర్ రచిన్ రవీంద్ర (240; 26 ఫోర్లు, 3 సిక్సర్లు) ద్విశతకంతో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు చేసింది. సొంతగడ్డపై జరుగుతున్న పోరులో కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులు చేసింది. రచిన్ డబుల్ సెంచరీ చేయగా.. కేన్ విలియమ్సన్ (118) శతక్కొట్టాడు. సఫారీ బౌలర్లలో నీల్ బ్రాండ్ ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా సోమవారం ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. చేతిలో 6 వికెట్లు ఉన్న సఫారీ జట్టు.. ప్రత్యర్థి స్కోరుకు 431 పరుగులు వెనుకబడి ఉంది.

## క్వార్టర్స్‌లో నిఖత్

స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీ

సోఫియా(బల్గేరియా): ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీలో భారత యువ బాక్సర్ నిఖత్ జరీన్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన మహిళల 50కిలోల ప్రిక్వార్టర్స్ బౌట్‌లో నిఖత్ 3-2తో ఒయున్‌స్టెగ్ సుజెన్(మంగోలియా)పై గెలిచింది. ఆది నుంచే ఇద్దరు బాక్సర్లు హోరాహోరీగా తలపడ్డారు. పదునైన పంచ్‌లకు సంధిస్తూ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించారు. అయితే తనదైన దూకుడు కనబరిచిన నిఖత్..ఆఖరికి విజేతగా నిలిచింది. 57కిలోల విభాగంలో సాక్షి చౌదరి 5-0తో సెల్మానీ చహీర(అల్జీరియా)పై గెలిచింది. మరోవైపు లవ్లీనా బొర్గోహై అనర్హతతో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, ప్రీతి పవార్(54కి) ఓటమిపాలైంది.



## సమా ఏంజెల్స్ ముందంజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(హెచ్‌పీజీఎల్)లో సమా ఏంజెల్స్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన పోరులో సమా ఎంజెల్స్ 175 పాయింట్లతో ఆకట్టుకుంది. గ్రూపు-ఏ నుంచి సమా ఏంజెల్స్(804), కేష్మ(698) క్వార్టర్స్‌లోకి ప్రవేశించగా, మిగతా గ్రూపుల నుంచి అల్ఫా, రఫ్‌రైడర్స్, డీఎస్ఆర్, టూటోరూట్, విల్లాజియో, మీనాక్షి తదుపరి రౌండ్‌లో నిలిచాయి.



వాణిజ్య



## ఎల్ఐసీ ఇండెక్స్ ప్లస్ పాలసీ

ముంబై, ఫిబ్రవరి 5: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఆఫ్ ఇండియా సోమవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. ఇండెక్స్ ప్లస్ పేరిట యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం, ఇండివీడ్యువల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకొచ్చింది. జీవిత బీమా కవరేజీతోపాటు కాలపరిమితి మొత్తంగా సేవింగ్స్‌కూ ఈ ప్లాన్ దోహదం చేస్తుందని ఓ ప్రకటనలో ఎల్ఐసీ పేర్కొన్నది. అలాగే షరతులకు లోబడి ఐదేండ్ల లాకిన్ పీరియడ్ అనంతరం ఎప్పుడైనా యూనిట్ల పాక్షిక ఉపసంహరణకు వీలున్నది. గ్యారంటీడ్ అడిషన్స్ కూడా ఉంటాయి.

## ఎయిర్‌టెల్ మొబైల్ టారిఫ్‌లు ప్రియం?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఇప్పటికే భారీగా పెరిగిన మొబైల్ టారిఫ్‌లు మరింత పెరగవచ్చని భారతి ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ విఠల్ సంకేతాలిచ్చారు. సోమవారం కంపెనీ ఆర్థిక ఫలితాల సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో.. కంపెనీ పెట్టుబడులపై రాబడి ఇంకా కనిష్ఠంగా 9.4 శాతమే ఉన్నదని, పరిశ్రమ ఆరోగ్యకరంగా ఉండాలంటే టారిఫ్‌ల పెంపు కీలకమని వివరించారు. డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం 54 శాతం వృద్ధిచెంది రూ.2,442 కోట్లకు చేరింది. ఆదాయం 5.8 శాతం వృద్ధితో రూ. 37,899 కోట్లకు పెరిగింది. భారత్‌లో కంపెనీ చందాదారుల సంఖ్య 7.5 శాతం పెరిగి 39.7 కోట్లకు చేరింది. ఏవరేజ్ రెవిన్యూ పర్ యూజర్ పర్ (ఏపీఆర్‌యూ) 7.7 శాతం వృద్ధితో రూ. 193 నుంచి రూ.208కి చేరింది.

## పేటీఎం వ్యాలెట్‌పై అంబానీ నజర్

### రేసులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా..


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రిజర్వ్ బ్యాంక్ నిషేధానికి గురైన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తన వ్యాలెట్ వ్యాపారాన్ని విక్రయించేందుకు జోరుగా చర్చలు జరుపుతుందన్న వార్తలు వెలువడుతున్నాయి. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ జియో ఫైనాన్షియల్, ప్రైవేటు రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లతో పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ చర్చిస్తున్నదని సంబంధిత సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను ఉటంకిస్తూ హిందూ బిజినెస్‌లైన్ తాజా కథనం పేర్కొంది. పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్‌శేఖర్ శర్మ బృందం గత ఏడాది నవంబర్ నుంచే జియోతో చర్చలు జరుపుతుండగా, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ నిషేధం విధించే ముందు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు మొదలుపెట్టారు. బెయిల్ అవుట్ ప్రణాళికలో భాగంగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను సైతం కొనేందుకు జియో ముందుకు వచ్చిందని సమాచారం.

**ఆల్‌టైమ్ కనిష్ఠానికి వన్ 97**

ఇప్పటికే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ డిపాజిట్ల సేకరణపై నిషేధం విధించిన ఆర్బీఐ ఈ బ్యాంక్ లైసెన్సు కూడా రద్దు చేస్తుందన్న వార్తలు వెలువడటంతో వన్ 97 కమ్యూనికేషన్స్ షేరు ఎన్ఎస్ఈలో సోమవారం మరో 10 శాతం పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయి రూ.438.5 వద్ద ముగిసింది. ఈ షేరు కేవలం 3 రోజుల్లో 42 శాతం పతనమయ్యింది. 2021 నవంబర్‌లో రూ.2,150 ధరతో ఈ కంపెనీ ఐపీవోకు వచ్చిన విషయం విదితమే. డిపాజిట్ల సేకరణను నిషేధించడంతో పాటు పరపతి లావాదేవీల నిర్వహణ, కస్టమర్ ఖాతాలకు టాప్‌అప్‌లు ఇవ్వడం, ప్రీపెయిడ్ సాధనాలు, వ్యాలెట్లు, కార్డులు జారీచేయడం తదితర పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) నిర్వహించే కార్యకలాపాలను ఫిబ్రవరి 29 తర్వాత చేపట్టరాదని ఆర్బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ జరుగుతుందన్న ఆందోళన, నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనల ఉల్లంఘనలతో పాటు పేటీఎం వ్యాలెట్, సంబంధిత బ్యాంక్‌ల మధ్య వందల కోట్ల రూపాయిల సందేహాస్పద లావాదేవీలు జరగడంతో పేటీఎం బ్యాంక్‌పై రిజర్వ్‌బ్యాంక్ నిషేధం విధించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చెప్పారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు 35 కోట్ల ఈ-వ్యాలెట్లు ఉండగా, అందులో 31 కోట్లు అరుదుగా లావాదేవీలు జరిగే డోర్‌మాంట్ వ్యాలెట్లని, కేవలం 4 కోట్ల వ్యాలెట్లు మాత్రమే బ్యాలెన్స్ లేకుండా లేదా అతితక్కువ బ్యాలెన్స్‌తో నడుస్తున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

**జియో ఫైనాన్షియల్ 15 శాతం జంప్**

పేటీఎం వ్యాలెట్‌ను కొనుగోలు చేస్తుందన్న వార్తలతో సోమవారం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 15 శాతం పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠస్థాయి రూ. 295 వద్ద ముగిసింది. గత ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విభజించిన జియో ఫైనాన్షియల్‌కు జియో పేమెంట్స్ బ్యాంక్ ఉన్నది. ఇది డిజిటల్ సేవింగ్స్ ఖాతాల్ని, బిల్ పేమెంట్స్ సర్వీసుల్ని ప్రారంభించేందుకు సంసిద్ధమవుతున్నది. ఇప్పటికే డెబిట్ కార్డుల్ని కూడా విడుదల చేస్తున్నది.




### ప్రస్తుతం దర్యాప్తు జరగడం లేదు

పేటీఎం ఉదంతంపై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర చట్ట సంబంధిత ఏజెన్సీలు దర్యాప్తు జరపడం లేదని కేంద్ర రెవిన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. ఒక తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఏవైనా చర్యలు తీసుకోవాల్సివస్తే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తీసుకుంటాయి. ఇప్పుడు అదేమీ లేదు' అని చెప్పారు. ఇదే విషయాన్ని పేటీఎం వెల్లడిస్తూ మనీ లాండరింగ్ ఆరోపణలపై తమ వ్యవస్థాపకుడు, సీఈవోపై ఈడీ దర్యాప్తు చేస్తున్నదన్న వార్తల్ని ఖండించింది.




## బాహుబలి ఐపీవో!

### దేశంలోనే అతిపెద్ద ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌గా రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: త్వరలో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఓ బాహుబలి ఐపీవో రాబోతున్నది. దక్షిణ కొరియా ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్.. ఈ బంపర్ పబ్లిక్ ఇష్యూను భారతీయ ఈక్విటీ మార్కెట్లలోకి తేబోతున్నది. ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా హ్యుందాయ్ కనీసం 3 బిలియన్ డాలర్ల నిధులనైనా సమీకరించాలని చూస్తున్నది. మన దేశ కరెన్సీలో ఇది సుమారు రూ.25,000 కోట్లు కావడం గమనార్హం. ఇప్పటిదాకా ఈ స్థాయిలో ఏ సంస్థ కూడా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి నిధులను సేకరించిన దాఖలాలు లేవు. దీంతో ఈ ఐపీవో వాస్తవ రూపం దాల్చితే భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డును సృష్టించనున్నది. ప్రస్తుతం ఈ రికార్డు ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ పేరిట ఉన్నది. 2022లో వచ్చిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పబ్లిక్ ఇష్యూ విలువ రూ.21,000 కోట్లు.

**ఏడాది ఆఖర్లో..**

ఈ ఏడాది ఆఖర్లో ఈ బడా పబ్లిక్ ఇష్యూను పట్టాలపైకి తీసుకురావాలని హ్యుందాయ్ భావిస్తున్నట్టు సమాచారం. ఐపీవో ద్వారా సంస్థలో 15-20 శాతం వాటాను విక్రయించేందుకు హ్యుందాయ్ కంపెనీ వర్గాలు యోచిస్తున్నట్టు సోమవారం తెలియవచ్చింది. ఈ వాటా అమ్మకంతో 3.3 బిలియన్ డాలర్ల నుంచి 5.6 బిలియన్ డాలర్ల వరకు నిధులను అందుకోవచ్చంటున్నారు. మరోవైపు దీనిపై కంపెనీ వర్గాలను సంప్రదించినా వారు స్పందించేందుకు నిరాకరించారు. కాగా, ప్రస్తుతం దేశీయ వాహన మార్కెట్‌లో మారుతీ సుజుకీ తర్వాత హ్యుందాయ్‌దే రెండో స్థానం. 1996లో భారత మార్కెట్‌లోకి హ్యుందాయ్ ప్రవేశించింది. ఇప్పుడు మార్కెట్‌లో 13 హ్యుందాయ్ మోడల్స్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా సంస్థకు 1,366 సేల్స్ పాయింట్లు, 1,549 సర్వీస్ పాయింట్లున్నాయి.

### లైన్‌లో రూ.72వేల కోట్ల ఐపీవోలు

దేశీయ స్టాక్ మార్కెట్లలోకి రావాలని కార్పొరేట్లు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలోనే మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అనుమతి కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు. మొత్తం 66 కంపెనీలు ఐపీవోకు రావాలని చూస్తుండగా, ఇందులో 25 సంస్థలకు ఇప్పటికే సెబీ నుంచి ఆమోదం లభించింది. ఈ ఐపీవోల విలువ రూ.27,190 కోట్లుగా ఉన్నది. మరో 41 సంస్థలు సెబీ అంగీకారం కోసం వేచిచూస్తుండగా, వీటి విలువ రూ.45,576 కోట్లుగా ఉన్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఈ మొత్తం కలిపితే రూ.72,000 కోట్లపైమాటే. ఈ ఏడాది ఓలా ఎలక్ట్రిక్, ఆఫీస్, మొబీక్విక్, ప్రోటీ, ఓరావెల్ స్టేస్, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ వంటి కొత్త తరం టెక్నాలజీ సంస్థలు ఐపీవోకు రావచ్చన్న అంచనాలున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, పర్యాటక రంగాలకు చెందిన కంపెనీలతోపాటు 15-20 యూనికార్న్‌లు సైతం ఐపీవోల రేసులో ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గత ఏడాది 57 సంస్థలు ఐపీవోల ద్వారా రూ.49,434 కోట్ల నిధులను సమీకరించాయి.

### రాయదుర్గంలో ఆగిన ట్రేడ్ సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రాయదుర్గంలోని నాలెడ్జ్‌సిటీలో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ప్రతిపాదిత 5స్టార్ లగ్జరీ హోటల్ కమ్ ట్రేడ్ సెంటర్ నిర్మాణం వాయిదా పడింది. తాము పిలిచిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)ను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్టు, ఎప్పుడు చేపట్టేదీ తరువాత వెల్లడిస్తామని టీఎస్ఐఐసీ ప్రకటించింది. మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద మూడెకరాల వైశాల్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో దీని నిర్మాణానికి గత ఏడాది అక్టోబర్‌లో టీఎస్ఐఐసీ ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీని అంచనా వ్యయం రూ.500కోట్లుగా నిర్ణయించారు.

**హైదరాబాద్‌లో ఈఎఫ్‌సీ జోరు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కో-వర్కింగ్ సంస్థ ఈఎఫ్‌సీ హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. హైదరాబాద్, నోయిడాల్లో కలిపి లక్ష చదరపు అడుగులకుపైగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకోగా.. హైదరాబాద్‌లోనే 60వేల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను పొందింది.



## ఎగిసిపడిన మార్కెట్

- ట్రేడింగ్ ముగింపులో భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 354 పాయింట్లు డౌన్

ముంబై, ఫిబ్రవరి 5: ప్రపంచ మార్కెట్లలో వేగంగా రంగులు మారడంతో సోమవారం భారత్ సూచీలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో 400 పాయింట్ల మేర పెరిగి 72,386 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరిన బీఎస్ఈ సెన్సెక్స్.. ముగింపు సమయంలో హఠాత్ పతనాన్ని చవిచూసి 71,602 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు 354 పాయింట్ల నష్టంతో 71,731 పాయింట్ల వద్ద నిలిచింది. ఇదేబాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 21,964-21,726 పాయింట్ల మధ్య ఊగిసలాడి 82 పాయింట్లు కోల్పోయి 21,772 పాయింట్ల వద్ద ముగిసింది. యూఎస్ ఫెడ్ వడ్డీరేట్ల కోతలు అంచనాలకు అనుగుణంగా ఉండవన్న భయాలతో ఆసియా, యూరప్ మార్కెట్ల బలహీనత దేశీయ ట్రెండ్‌ను దెబ్బతీసింది. రిలయన్స్ 1.3 శాతం మేర తగ్గడం సెన్సెక్స్‌ను నష్టాలకు గురిచేసింది. ఎయిర్‌టెల్ ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో 3 శాతంపైగా తగ్గింది. క్యూ3 ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాల్ని మించడంతో టాటా మోటార్స్ సెన్సెక్స్ షేర్లలో 6 శాతం పెరిగి ఆల్‌టైమ్ రికార్డుస్థాయి రూ.928 వద్ద ముగిసింది.

**ఎల్ఐసీ @ రూ. 1000**

ఎల్ఐసీ షేరు లిస్టయిన తర్వాత తొలిసారిగా రూ.1,000 స్థాయిని చూసింది. బీఎస్ఈలో తాజాగా ఇది 5.9 శాతం పెరిగి రూ.1,000.35 వద్ద ముగిసింది. దీంతో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్లను దాటి రూ.6,32,721 కోట్లకు చేరింది. షేరు ఇంట్రాడేలో 1,028 గరిష్ఠాన్ని తాకింది. రూ.949 ధరతో ఐపీవోకు వచ్చిన ఎల్ఐసీ 2022 మే నెలలో లిస్టయిన సంగతి తెలిసిందే. ఈ షేరు 2023 మార్చిలో రూ.530 కనిష్ఠానికి పతనమయ్యింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.